# యుద్ధం

మనిషి విత్తనం లాంటివాడు. అతను ఎదిగి వృక్షం కావాలి. విత్తనం విత్తనంలాగే మరణిస్తే, అది ఎదగకుండా మరణించిందని అర్ధం. అలాగే విత్తనం ఎదగకుంటే, అది మరణానికి చేరువ అవుతున్నదని అర్ధం. కనుక మీరు ఎదగాలి లేదా మరణించాలి. వేరే ప్రత్యామ్నాయం లేదు.

విత్తనం రెండు విధాలుగా మరణించవచ్చు. విత్తనం ఎదగకుండా మరణించవచ్చు, లేదా విత్తనం ఎదగడానికి మరణించవచ్చు అంటే విత్తనంగా మరణించి మొక్కగా జన్మించవచ్చు. కనుక ఎదగడానికి మరణించడం అనేది ఎక్కువ సమయం జీవించడానికి ద్వారం అవుతుంది. ఎదగడానికి మరణించడం అంటే ప్రస్తుత స్థితి కంటే ఉన్నతమైన స్థితిలో జన్మించడం కోసం మరణించడం, మీరు ఒక తలంలో కనుమరుగై మరొక ఉన్నత తలంలో ప్రత్యక్షమవ్వడం.

మనిషి పదార్థంగా చనిపోయి ఆత్మలో పునర్జన్మించడమనేది రోజు జరగాలి లేదా అంతర్ ప్రయాణం టాపిక్‌లో చెప్పినట్టు అధిపతి పుట్టాలి. అంటే స్వచ్ఛమవ్వాలి లేదా తెలిసినదానిలో మరణించి తెలియని దానిలో పునర్జన్మించాలి. ఇక్కడ తెలిసినది పదార్థం, తెలియనిది రహస్యమైనది ఆత్మ.

తెలియని జ్ఞానం తెలిస్తే అది కూడా పదార్థం అవుతుంది. అలాగే పదార్థం అంటే రూపం అంటే అహం. అనగా ఈ మాయా ప్రపంచంలో అహం-కర్తగా లేదా చేసే-నేనుగా లేదా జీవాత్మగా ఎన్నో పాత్రలను పోషిస్తున్న మీరు పాత్రధారుడిగా మరణించి, రోజు నిరాకారుడిగా లేదా అధిపతిగా లేదా చూసే-నేనుగా లేదా సూత్రధారుడిగా పునర్జన్మించాలన్న మాట.

ఇలా తెలిసిన దానిలో మరణించి, తెలియని దానిలో పునర్జన్మించడమనేది నిరంతరం జరగాలి, అప్పుడే అభివృద్ధి అనేది సాధ్యమౌతుంది. ఇక్కడ మరణించడానికి సిద్ధపడవలసినది శరీరం కాదని, అందులో నివసిస్తున్న అహం-కర్త అయిన మీరేననే విషయాన్ని ఎల్లప్పుడూ జ్ఞప్తిలో ఉంచుకోండి.

ఇలా మాయా ప్రపంచంలో ఉన్న త్రిగుణాలను, మనుషులను, మిగతా అన్నింటినీ ఒక సాధనంగా, వాహనంగా ఉపయోగించుకుని, అంతరంలో ఉన్న శాశ్వతమైన ఇంటిని కనుక్కొని, తర్వాత ప్రాపంచికమైన వాటన్నింటిని స్వచ్ఛంగా చేసి శాశ్వతమైన ఇంట్లోకి ప్రవేశించడమే ప్రతిరోజు మీ లక్ష్యంగా ఉండాలనే విషయాన్ని మదిలో ఉంచుకోండి.

కనుక ఇప్పుడు మరణించి మళ్ళీ పునర్జన్మించడం ఎలా అనే ప్రశ్న ఉదయిస్తుంది? నిత్యం మీరు ఎన్నో

సంకల్పిస్తారు. ఉదాహరణకు మీరు ఏదైనా మంచి పనిని సంకల్పించి ధ్యానం చేసినప్పుడు, 100% శక్తి కేవలం మంచికే లభించదు, చెడు మరియు తటస్థానికి కూడా లభిస్తుంది. కనుకనే ఏదైనా సంకల్పించిన వెంటనే అది నెరవేరుతుందో లేదోననే భయం కూడా మనకు మొదలౌతుంది.

ధర్మం టాపిక్‌లో చెప్పినట్టు మీలోపల గుణాల మిశ్రమం ఎలా ఉంటే, ఉదాహరణకు 60% మంచి, 30% చెడు, 10% తటస్థం ఉంటే, దానికి తగ్గట్టు వ్యతిరేకాలు శక్తిని ఆకర్షిస్తాయి. ఈ మిశ్రమం అనేది అందరికి ఒకలా ఉండదు. ఎవరికి ఎంత ఉన్నదో ఖచ్చితంగా చెప్పలేం, అలాగే ఇది పరిస్థితులను బట్టి మారుతుంది. అప్పుడు సాధన చేసి మిశ్రమం సమపాళ్ళకు వచ్చేలా ప్రయత్నించాలి. ఈ మిశ్రమం మీలో సమపాళ్ళకు చేరుకున్నప్పుడు మీరు పరమానందాన్ని అనుభూతి చెందుతారు.

అలాగే మీరు ఏది సంకల్పించినా దానికి సంబంధించి మూడు వ్యతిరేక పాత్రలు తప్పక సృష్టించబడతాయని గ్రహించండి. అంటే మీరు మంచి గురువు కావాలని సంకల్పిస్తే, మీకు తెలియకుండానే మీరు చెడు మరియు తటస్థ గురువులను కూడా సంకల్పిస్తున్నారు, అలాగే దానికి తగ్గట్టు మీరు మంచి-చెడు-తటస్థ శిష్యుడి

పాత్రలను కూడా సంకల్పిస్తున్నట్టే. అందుకే గురువు శిష్యుడికి మరియు శిష్యుడు గురువుకి మూడు రకాలుగా అనిపిస్తాడు. కనుక ఇదంతా మీ సంకల్పానికి తగ్గట్టుగానే జరుగుతోందని అర్థం చేసుకుని, దీనిని నేనే సృష్టించాను, ఇన్ని రోజులు నేనే పోషించాను, కాబట్టి ఇప్పుడు లయం చేసే భాధ్యత కూడా నాదేనని ఆ సంకల్పానికి సంబంధించిన మూడింటినీ అంటే గురువు మరియు శిష్య పాత్రలన్నింటినీ లయం అంటే స్వచ్ఛం చేయండి.

వ్యతిరేకాల మధ్య యుద్ధం ద్వారా లేదా వాటి మధ్య మిత్రత్వం సృష్టించడం ద్వారా వాటిని లయం చేయవచ్చు. అందువలన మీరు చేయవలసినది ఏమిటంటే, సంకల్పించిన వాటికి సంబంధించిన అనుభవాలను దివ్యంగా అనుభవిస్తూ, ఆ అనుభవాలకు సంబంధించిన లక్షణాల సహాయంతో మీరు అధిపతిగా పునర్జన్మించడానికి మరణించాలని నిశ్చయించుకోవాలి. తర్వాత వ్యతిరేకాల మధ్య మిత్రత్వాన్ని సృష్టించి ఏకం చేయడం, దీని గురించి మరింత సమాచారం కోసం అంతర్‌ప్రయాణం అనే టాపిక్‌ని చదవండి.

కాని కొన్ని పాత్రలు మిత్రత్వానికి సహకరించవు, ఎందుకంటే అవి మంచి-చెడు-తటస్థాల మధ్య శత్రుత్వం ఉన్నప్పుడు సంకల్పించి సృష్టించినవి.

అవి ఇలా ప్రోగ్రామింగ్ చేయబడ్డాయి కనుక వాటికి కేవలం యుద్ధం చేయడం మాత్రమే తెలుసు. అంటే మీరు న్యూ ఎనర్జీ కాన్సెప్ట్‌ని ఫాలో కాక ముందు, వ్యతిరేకాలను శత్రువులుగా భావించే స్థితిలో ఉండి, ఆ పాత్రలతో బంధాన్ని కొనసాగించారు, కనుక అవి ససేమేరా కలవడానికి ఇష్టపడవు. అవి మీ ధ్యానానికి కూడా అడ్డుతగులుతాయి, అలాగే మీకే సరెండర్ అవుతాను, నేను స్వచ్ఛం కావడానికి సహకరించండి అని వాటిని అర్ధించినా, అవి యుద్ధానికి తప్ప దేనికీ ఒప్పుకోవు. అలాగే వాటి ప్రభావం మీపై పడి మీరు గందరగోళంలో పడుతున్నారంటే అర్థం, మీలో కూడా లోపం ఉన్నదని, మీరు కూడా ఇక్కడ పాత్రలో ఇరుక్కుని ఉన్నారని, స్వచ్ఛంగా లేరని.

కనుక కరిగిపోండి సాధన చేసి మీరు స్వచ్ఛమైన తర్వాత, మీరు వేసిన పాత్రతో అలాగే మీలో ఉన్న మిగతా పాత్రలతో అంతరంలో యుద్ధం చేసి వ్యతిరేకాలన్నింటినీ సర్వనాశనం చేయండి. ఇలా చేయడం వలన, ధ్వంసమైన ఈ శక్తులు స్వచ్ఛమైన శక్తులుగా పరివర్తన చెంది మీరు పెట్టబోయే కొత్త సంకల్పాలకు ఉపయోగపడతాయి,

కాని శక్తిని పుట్టించలేం అలాగే నాశనం కూడా చేయలేం కదా అనే

సందేహం ఇక్కడ మీకు కలగవచ్చు. దీనికి నా సమాధానం ఏమిటంటే, శక్తిని పూర్తిగా నాశనం చేయటం లేదని, దానితో ప్రేమగా కాకుండా, కఠినంగా ఉండి ధ్వంసం చేసి స్వచ్ఛమైన శక్తిగా పరివర్తన చేస్తున్నామని. అలాగే మీది న్యూ ఎనర్జీ కాన్సెప్ట్ కదా అంటే కొత్త శక్తిని పుట్టించవచ్చా అనే సందేహం కూడా మీకు కలగవచ్చు. దీనికి నా సమాధానం ఏమిటంటే, దైవం వద్ద స్వచ్ఛమైన శక్తి అనంతంగా ఉన్నదని, దీనినే నేను న్యూ ఎనర్జీ అంటున్నానని, మీరు స్వచ్ఛమైతేనే ఇది మీకు అందుబాటులో ఉంటుందని.

## సాధన

ఉదాహరణకు భార్య మాట భర్త వినకుండా తమ్ముడి మాట వింటున్నాడనుకుందాం. అప్పుడు భార్య చేయవలసిన సాధన ఏమిటంటే - మీరు నా మాట వినకుండా మీ తమ్ముడి మాట వింటున్నారు, నా మాటల ద్వారా మీకు కిక్కు రావటం లేదు, కనుకనే మీరు అతని మాట వింటున్నారని నేను అర్థం చేసుకున్నాను. కనుక నేను భార్య పాత్ర నుంచి బయటకు వచ్చి తటస్థంగా ఉండి మిమ్మల్ని మార్చాలని చూడకుండా ఉన్నది ఉన్నట్టు అంగీకరిస్తున్నాను, మీరు కూడా భార్య పాత్రను అంగీకరించండి అని అంతరంలో అనుకుని పాత్రల మధ్య మిత్రత్వాన్ని సృష్టించడానికి

ప్రయత్నించండి. లేదా వాటి సహకారంతో స్వచ్ఛమవ్వడానికి ప్రయత్నించండి.

ఒక వేళ పాత్రలు సహకరించకపోతే - మీరు ఒంటరిగా కూర్చుని అంతరంలో భార్య పాత్ర వైపు ఉంటూ భర్త మరియు తటస్థ పాత్రలతో, అలాగే భర్త పాత్ర వైపు ఉంటూ భార్య మరియు తటస్థ పాత్రలతో, అలాగే తటస్థ పాత్ర వైపు ఉంటూ భార్య మరియు భర్త పాత్రలతో యుద్ధం చేయండి. ఇలా ఒకవైపు ఉంటూ మిగతా వాటిని నాశనం చేస్తూ చివరికి స్వచ్ఛమైన జీవాత్మగా ఉంటూ మంచి-చెడు-తటస్థ వ్యతిరేకాలను ఒకేసారి ధ్వంసం చేయండి. ఎందుకంటే ఇవి స్వచ్ఛమైన శక్తిలోంచి ఒకేసారి పుట్టాయి. కనుక అవి కలిసికట్టుగా పెరిగి, ఆ తర్వాత ఒకేసారి కలిసి లయమై స్వచ్ఛమైన శక్తిలో అవి తిరిగి కలిసిపోతాయి.

అంటే ఇక్కడ ఒక్కటి మాత్రమే మిగిలి ఉండడం అసాధ్యమని, వ్యతిరేకాలు మూడు ఎల్లప్పుడూ ఉంటాయని అర్థం. ధ్యానం ద్వారా లేదా నిద్ర ద్వారా ఎల్లప్పుడూ శక్తి మూడింటికీ లభిస్తుంది. కనుక ఏదో ఒకటి బలహీనపడినా అది మళ్ళీ శక్తిని పుంజుకుని యుద్ధాన్ని కొనసాగిస్తుంది. అలాగే ఎప్పుడు మీకు నచ్చిన వైపే శక్తి అధికంగా ఉంటుందని గ్యారెంటీ లేదు, కనుక జయాపజయాలు రెండూ ఉంటాయి. ఒకవేళ మీరు ఒక వైపు

ఉంటూ మరో దానితో యుద్ధం చేసి ఎల్లప్పుడూ గెలిచినా మీరు ఎన్నటికీ దైవాన్ని చేరలేరు, మాయలోనే ఇరుక్కుని ఉంటారు. కనుక దీనికి పరిష్కారం వ్యతిరేకాలన్నింటినీ యుద్ధం ద్వారా ధ్వంసం చేయడం లేదా మూడింటినీ కలిపి ఏకం చేయడం.

అలాగే సృష్టి మీ లోపలే జరుగుతున్నదని, అన్ని రకాల పాత్రలను మీరు గతజన్మలలో ఎత్తేసారని, మీకు అన్ని రకాల అనుభవాలు అయిపోయాయని, వాటన్నింటిని స్వచ్ఛంగా పరివర్తనం చెందించి ముక్తి పొందడానికే ఈ జన్మ తీసుకున్నానని, యుద్ధం చేస్తున్నది మీ గతజన్మ పాత్రలతోననే విషయాన్ని మదిలో ఉంచుకుని, లోపలే యుద్ధం చేయండి. లేదా యుద్ధం చేయలేనని భావిస్తే ఆత్మ స్థితిలో పునర్జన్మించడానికి కరిగిపోండి అనే టాపిక్‌లో చెప్పినట్టు కరిగిపోవడం సాధన చేయండి.

ఆత్మలో కొంత సమయం ఉన్న తర్వాత శరీరంలోకి తిరిగి వచ్చేయండి. అప్పుడు శరీరంలోకి కొత్త మనిషి ప్రవేశిస్తాడు, ఎందుకంటే మీరు మృత్యువును తెలుసుకున్నారు కనుక. మీకు తెలిసినది శరీరానికి అతీతంగా ఉన్న ఆత్మ తలం. కనుక ప్రతీ అనుభవం పొందిన తర్వాత దైవ సామ్రాజ్యంలోకి ప్రవేశించండి, అప్పుడే అటు-ఇటు

ప్రయాణం చేయడంలో నిష్ణాతులౌతారు. దైవ సామ్రాజ్యం ఎల్లప్పుడు అందుబాటులోనే ఉంటుందనే విశ్వాసం మీకు కలుగుతుంది. అలాగే దైవం వద్ద ప్రాపంచిక సమస్యలన్నింటికీ పరిష్కారం లభిస్తుంది కనుక మీరు దైవాన్ని అడిగి ఆయన సూచించింది ఆచరణ చేస్తే సమస్యలను మీ అంతట మీరే పరిష్కరించుకుని ఆనందంగా జీవిస్తారు.

ఇలా రోజు యుద్ధం ద్వారా లేదా మిత్రత్వం ద్వారా అన్నింటినీ స్వచ్ఛం చేసి, తర్వాత ధ్యానం చేసి లేచే ముందు - వ్యతిరేకాలతో స్నేహపూర్వకంగా ఉండాలని లేదా అందరితో అన్ని పరిస్థితులలో అంటీ-ముట్టనట్టుగా ఉండాలని లేదా సూత్రధారుడిగా ఉంటూ అన్ని రకాల పాత్రలను పోషించాలని లేదా మీకు అనిపించిన విధంగా సంకల్పించి కొంత సమయం తర్వాత కనులు తెరవండి. ఇలా మీ సృజనాత్మకతను ఉపయోగించి ఇదే శరీరంలో కొత్త కొత్తగా చనిపోతూ మళ్ళీ పునర్జన్మిస్తూ గత అనుభవాలనన్నింటినీ స్వచ్ఛమైన అనుభవాలుగా పరివర్తనం చేయండి. అప్పుడే గతం యొక్క ప్రభావం వర్తమానం మీద ఉండదు. అప్పుడే కర్మసిద్ధాంతానికి అతీతంగా మీరు చేరుతారు.

** ఈ లింక్‌ని క్లిక్ చేసి ఆడియోలు వరుసగా వింటే మరియు టాపిక్స్

చదివితే, మీకు న్యూఎనర్జీ-అద్వైతం కాన్సెప్ట్ స్పష్టంగా అర్థమవుతుంది. http://darmam.com/important-topics.html

## కరిగిపోండి-ధ్యానం

శరీరం, మనసు మరియు హృదయం దాటి మీలో ఉన్న ఆత్మ వద్దకు చేరాలంటే, మీలో వస్తున్న ఆలోచనలకు ప్రభావితమౌతూ ఒక బంధీలా జీవిస్తున్నారని ముందు మీరు గుర్తించాలి. తర్వాత ప్రశాంతంగా ఉంటూ దృష్టిని ఆలోచనల నుంచి మీ వైపు తిప్పి, మిమ్మల్ని మీరు కరిగించుకోవడానికి సాధన చేయండి. మీలో ఏమి జరుగుతున్నా దాంట్లో ఏమాత్రం పాల్గొనకుండా, భూ జల అగ్ని వాయు తత్వాలను వదిలేసి, సుఖదుఃఖాలను వదిలేసి, కేవలం మీరు మాత్రమే మంచు ముక్కలా కరిగిపోయి స్వచ్ఛమైన తర్వాత, లోపలంతా వ్యాపించి అలానే ఉండిపోండి. అంటే మాట్లాడకుండా, ఆలోచించకుండా, మరేపని చేయకుండా, కేవలం నేను వ్యాపించి ఉన్నాను అనే భావనలో ఉండండి. అప్పుడు మీరు నిద్రలాంటి స్థితిలోకి వెళ్తారు, లేదా మీలో ఉన్న శూన్య స్థితితో ఏకమై ఉంటారు. ఈ స్థితిలో మీరు కొద్ది సమయం ఉండగలిగితే, ఆలోచనలు వాటంతట అవే కరిగిపోయి మీలో నిశ్శబ్దం ఏర్పడి, ఆ తర్వాత దైవం ప్రత్యక్షమౌతాడు. అప్పుడు మీరు ఎంతో హాయిని, తేలికతనాన్ని, తాజాతనాన్ని, ఆనందాన్ని అనుభూతి చెందుతారు. వెంటనే కళ్ళు తెరవకుండా ఈ ఆనందాన్ని మీ అన్ని భాగాలకు పంపించండి. దీని వలన అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. అలాగే మీ అన్ని భాగాల మధ్య

సమన్వయం ఏర్పడుతుంది. ఈ ధ్యానాన్ని ఎవరైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా, ఏ సమయంలోనైనా, ఎంత సమయమైనా చేసుకోవచ్చు. ప్రతిరోజు కనీసం 30 నిమిషాలైనా ధ్యానం చేయండి.